నిబంధనలు తుస్

- అధికార పార్టీ నేతల అండతో బాణసంచా దుకాణాల ఏర్పాటు
- లక్కీడిప్ పూర్తికాక ముందే యథేచ్ఛగా..


మినీబైపాస్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన దుకాణం

నెల్లూరు(క్రైమ్): దీపావళి నేపథ్యంలో బాణసంచాను విక్రయించాలంటే అన్ని పత్రాలను సమర్పించి లక్కీడిప్‌లో షాపులు పొందాలి. అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేయాలనేది నిబంధన. అయితే అధికార పార్టీ నేతల అండదండలతో నిబంధనలను కొందరు తుంగలో తొక్కారు. ప్రజల భద్రతను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా తమకు ఇష్టమొచ్చిన ప్రాంతాల్లో దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. లక్కీడిప్ ప్రక్రియ పూర్తికాక ముందే విక్రయాలను ప్రారంభించారు.

ఇదీ ప్రక్రియ..

దీపావళి నేపథ్యంలో బాణసంచా విక్రయ కేంద్రాలకు ప్రత్యేక ప్రాంతాలను అధికారులు ఎంపిక చేస్తారు. అనంతరం ఆయా డివిజన్ల పరిధిలోని ఆర్డీఓలు లక్కీడిప్ తీసి దుకాణాలను కేటాయిస్తుంటారు. ఇందులో దక్కించుకున్న వ్యాపారులు నిబంధనల మేరకు అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేస్తారు. అయితే ఈసారి అధికార పార్టీ నేతల అండదండలతో వారి అనుచరులు, కొందరు వ్యాపారులు నిబంధనలకు నీళ్లొదిలారు. లక్కీడిప్ ప్రక్రియ ప్రారంభంకాక ముందే ఆదివారమే దుకాణాలను తమకు నచ్చిన ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు. తమను అడిగేవారెవరనే ధీమాతో కొన్ని చోట్ల విక్రయాలను సోమవారం ఉదయం నుంచే ప్రారంభించారు. కొన్ని ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు ఆయా ప్రాంత అధికార పార్టీ నేతలు వ్యాపారుల నుంచి భారీగా నగదును వసూలు చేసి భరోసా ఇచ్చారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎక్కడపడితే అక్కడ..

వాస్తవానికి నగరంలో వీఆర్సీ, వైఎమ్సీఏ, సర్వోదయ, ఆరెస్సార్, ఎస్వీజీఎస్ గ్రౌండ్స్‌లో దుకాణాలను ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా నగరంలోని చిల్డ్రన్స్‌పార్క్, అన్నమయ్య సర్కిల్, మినీబైపాస్ తదితర ప్రాంతాల్లో దుకాణాలు వెలిశాయి. మరోవైపు ఈ పరిణామాలతో తాము నష్టపోతామని లక్కీడిప్‌లో దుకాణాలు పొందిన వ్యాపారులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా, స్పందన కొరవడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో చేసేదేమీలేక సాధారణ వ్యాపారులు తమకు కేటాయించిన ప్రదేశాల్లో దుకాణాలను ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిబంధనల మేరకే ఏర్పాటు చేయాలి

నిబంధనల మేరకు కేటాయించిన ప్రాంతాల్లోనే దుకాణాలను ఏర్పాటు చేయాలి. అతిక్రమిస్తే చర్యలు తప్పవు.
– నాగసంతోష్ అనూష, ఆర్డీఓ, నెల్లూరు

ఆక్రమణలపై విచారణకు వినతి


అదనపు కమిషనర్‌కు వినతిపత్రమిస్తున్న నాగార్జున

నెల్లూరు(బారకాసు): కాలువను టీడీపీ నేతలు ఆక్రమించిన ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు చేపట్టాలని 13వ డివిజన్ కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అదనపు కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని డివిజన్‌కు చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డివిజన్లోని పార్కు స్థలంలో అక్రమ కట్టడాన్ని తమ పార్టీ అడ్డుకుందనే నెపంతో టీడీపీ నేతలు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో కాలువల ఆక్రమణ జరిగిందని, 607 సర్వే నంబర్ మేరకు రీ సర్వే చేయాలని కమిషనర్‌కు టీడీపీ నేత ఉచ్చి భువనేశ్వరిప్రసాద్ ఫిర్యాదు చేయడం హాస్యాస్పదమని విమర్శించారు. కాలువ ఎక్కడి నుంచి ప్రారంభమైందో అక్కడి నుంచి రీ సర్వే చేసి, ఆక్రమించుకున్న వారు ఎంతటి వారైనా ఉపేక్షించొద్దని కోరారు. వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించిన రూ.200 కోట్ల విలువైన భూములను ఆక్రమించి ఇళ్ల నిర్మాణం జరిపిన విషయమై విచారణ ఎందుకు కోరడంలేదని ప్రశ్నించారు. వీటిని ఖాళీ చేయించాలని ఐదు నెలల క్రితం కోర్టు నోటీసులను జారీ చేసినా, ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. టీడీపీకి ఓటేయలేదనే కారణంతో డివిజన్లోని ఆరుగురు నిరుపేదలను మంత్రి నారాయణ తమ సంస్థలో ఉద్యోగం నుంచి తొలగించారని ధ్వజమెత్తారు.

ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను ఆపాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నెల్లూరు (టౌన్): విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను నిలిపేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరేంద్ర డిమాండ్ చేశారు. బాలాజీనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును పరిరక్షించాలనే డిమాండ్‌తో విశాఖపట్నంలో రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్‌ను నవంబర్ ఒకటిన నిర్వహించనున్నామని చెప్పారు.
కార్యక్రమానికి భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. నేతలు చరణ్, విష్ణు, పవన్, యశ్వంత్, రంజిత్, సోమయ్య, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు అవసరం


నేత్ర పరీక్షలు చేయించుకుంటున్న కృష్ణకాంత్

నెల్లూరు(క్రైమ్): విధి నిర్వహణతో పాటు ఆరోగ్యంపై పోలీసులు జాగ్రత్త వహించాలని ఎస్పీ కృష్ణకాంత్ పేర్కొన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో మెగా రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సహకారంతో.. కవాతు మైదానంలో ఉచిత మెడికల్ క్యాంపును కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో సోమవారం నిర్వహించారు. అనంతరం పోలీస్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులకు వైద్యులు వివిధ పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. మెడికల్ క్యాంపులో పాల్గొన్న వైద్యులు, సహకరించిన పీహెచ్‌పీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్‌ను ఎస్పీ అభినందించి ప్రశంసపత్రాలను అందజేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్‌తో పాటు 760 మంది రక్తదానం చేశారు. ఏఎస్పీ సౌజన్య, పీహెచ్‌పీ జిల్లా గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, పోలీస్ యూనిట్ హాస్పిటల్ వైద్యుడు అఖిలేష్, వైద్యులు అశ్విన్‌కుమార్, మాధవరావు, వెంకటతరుణ్, గోకులకృష్ణన్, ప్రేమ్‌దీప్, అజయ్‌కుమార్, రాజేంద్రరెడ్డి పోలీస్ అధికారుల సంఘ జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు పాల్గొన్నారు.

దేశభక్తిని పెంపొందించడమే ధ్యేయం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): యువతలో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించాలనే లక్ష్యంతో దివాలీ విత్ మై భారత్ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్నారని జిల్లా యువజన అధికారి మహేంద్రరెడ్డి పేర్కొన్నారు. దివాలీ విత్ మై భారత్ కార్యక్రమాన్ని నెహ్రూ యువ కేంద్రం, కృష్ణచైతన్య డిగ్రీ కళాశాల ఎన్నెస్సెస్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ర్యాలీని ట్రాఫిక్ ఎస్సైలు ఖాదర్‌బాషా, నాగరాజు ఆధ్వర్యంలో జరిపారు.

మద్యం షాపును తొలగించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముస్లింలు

నెల్లూరు(దర్గామిట్ట): ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో మసీదు పక్కన ఏర్పాటు చేసిన మద్యం షాపును వెంటనే తొలగించాలని భారత రాజ్యాంగ పరిరక్షణ జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని కమిటీ సభ్యులు సోమవారం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మన రాష్ట్రంలో కూడా కేరళ తరహా వక్ఫ్ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో మౌలానా మొహమ్మద్ ఇలియాస్, అబ్దుల్ కరీం, షకీల్, నవీన్ అహ్మద్, సర్దార్, అబ్దుల్ ఘనీ, జాకీర్, రఫీ, హుమయున్ తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే పాలసీలు కొనసాగించాలి

నెల్లూరు(అర్బన్): పాత పద్ధతిలోనే పాలసీలను కొనసాగించాలని లైఫ్ ఇన్సురెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ సిటీ బ్రాంచ్ – 1 అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. ఐఆర్డీఏ పేరిట ఎల్ఐసీలో పాలసీదారులు, ఏజెంట్లకు నష్టాన్ని కలగజేసేలా సంస్కరణలు తీసుకొవచ్చిన కేంద్ర ప్రభుత్వం తమ నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని కోరుతూ నగరంలోని ఎల్ఐసీ కార్యాలయాల వద్ద ధర్నాను సోమవారం చేపట్టారు. దర్గామిట్టలోని సిటీ బ్రాంచ్ – 1 వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. రూ.లక్ష సమ్ అస్యూర్డ్ ఉన్న పాలసీని రద్దు చేసి పేదలకు ఇన్సురెన్స్‌ను దూరం చేయడం దుర్మార్గమన్నారు. లియాఫీ కార్యదర్శి షాహుల్ హమీద్‌బాషా, నేతలు మధుసూదన్‌రావు, గాలిబ్, మహబూబ్‌బాషా, నూర్జహాన్, సుమతి, నీలిమ, పెంచలయ్య పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

నెల్లూరు(సెంట్రల్): నగరంలోని పలువురికి సీఎం సహాయనిధి చెక్కులను తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి నారాయణ సోమవారం పంపిణీ చేశారు. అనంతరం నగరంలోని టీడీపీ నేతలతో సమావేశమయ్యారు.

నాణ్యత లేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో నాణ్యత లేని విత్తనాలను విక్రయించే దుకాణదారులపై కఠిన చర్యలు చేపడతామని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విత్తనాలతో ఇబ్బందులు ఏర్పడ్డాయనే అంశంపై రైతుల నుంచి పలు ఫిర్యాదులొచ్చాయని చెప్పారు. జిల్లాలోని 60 విత్తన దుకాణాల్లో తనిఖీ చేసి, 47 నమూనాలను సేకరించి పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు. అధీకృత డీలర్ల వద్దే కొనుగోలు చేయడంతో పాటు బిల్లును విధిగా పొందాలని సూచించారు.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగ సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం నిర్వహించారు. అర్జీలను అదనపు కమిషనర్ నందన్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రజల నుంచి అందుకున్న ఫిర్యాదులు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాన్ని చూపాలని సూచించారు. కాగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా 30 అర్జీలు అందాయని తెలిపారు. సిటీ ప్లానర్ కృష్ణకిశోర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

మహిళా సాధికారతే లక్ష్యంగా మెప్మా తగు చర్యలు చేపడుతోందని అదనపు కమిషనర్ నందన్ పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించే స్టాళ్లను బారాషహీద్ దర్గా రోడ్డు సమీపంలో ఆయన పరిశీలించారు. టీపీఆర్వో బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): ఆటో మెకానిక్ హత్య కేసులో నిందితుడ్ని వేదాయపాళెం పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. ఇందిరమ్మ కాలనీకి చెందిన ముక్తియార్ (38) అయ్యప్పగుడి సమీపంలోని పఠాన్‌బాబుకు చెందిన ఆటో మెకానిక్ షెడ్‌లో గతంలో పనిచేశారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ముక్తియార్ తన ఆటోను తాకట్టు పెట్టారు. ఈ నెల 24వ తేదీ సాయంత్రం అతను పఠాన్ షెడ్ వద్దకు వెళ్లారు. ఆటోను విడిపించుకునేందుకు రూ.30 వేలు కావాలని అడిగారు. వీరి మధ్య వాగ్వాదం జరగ్గా, కోపోద్రిక్తుడైన బాబు ఇనుప కమ్మీతో ముక్తియార్‌ను హత్య చేసి పరారయ్యారు. ఇన్‌స్పెక్టర్ కిశోర్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో పరారీలో ఉన్న బాబును అరెస్ట్ చేశామని తెలిపారు.

క్లుప్తంగా

వరద బాధితులకు విరాళం



నెల్లూరు (టౌన్): విజయవాడ వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.65 లక్షలను సీఎం చంద్రబాబుకు అపస్మా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. జిల్లా అపస్మా నుంచి రూ.30 లక్షలను అందజేశామని చెప్పారు. రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షుడు నేతాజీ సుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, నగర కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు ఇక్కట్లు తలెత్తకూడదు

నెల్లూరు(బృందావనం): కార్తీక మాసంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో నవంబర్ రెండు నుంచి 30 వరకు నిర్వహించనున్న కార్తీక మాసోత్సవాలపై వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఏ సమస్య వచ్చినా స్పందించాలి

నెల్లూరు(బారకాసు): ఎక్కడ ఏ సమస్య వచ్చినా నేతలు వెంటనే స్పందించాలని, అప్పుడే ప్రజల సమస్యలు తీరుతాయని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయని, వీటికి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. కాలువల్లో మురుగు సక్రమంగా ప్రవహించకపోవడంతో దోమల మోత అధికమవుతోందని చెప్పారు. కాలువలపై కాంక్రీట్ వాల్‌ను రూ.28 కోట్లతో నిర్మించాలని పేర్కొన్నారు. రానున్న ఐదేళ్లలో నగరంలోని డ్రెయిన్ల పనులను పూర్తి చేస్తామని తెలిపారు. హడ్కో నిధులు రాగానే భూగర్భ డ్రైనేజీ పనులను పూర్తి చేసి దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. మున్సిపల్ శాఖలో ఎక్కడ ఏ తప్పు జరిగినా, మొదట తననే ప్రశ్నిస్తారని.. ఈ క్రమంలో అలాంటివి జరగకుండా చూడాలని చెప్పారు. నగరంలోని ఏసీ బస్ షెల్టర్లకు మరో 15 రోజుల్లో మరమ్మతులు చేసి పునఃప్రారంభిస్తామని వెల్లడించారు. ఎక్కడైతే సెంట్రల్ లైటింగ్, డివైడర్లు, పూలమొక్కలు అవసరమో గుర్తించి వాటని పూర్తి చేస్తామన్నారు. నగరంలో మరో రెండు పార్కులను గ్రీన్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నామని ప్రకటించారు. నగర పరిధిలో నాలుగు రీచ్‌లను ఏర్పాటు చేశారని, దీంతో ఇసుక ధర తగ్గిందని తెలిపారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, కమిషనర్ సూర్యతేజ పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా



నెల్లూరు(బారకాసు): నెల్లూరు నగరపాలక సంస్థలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నాను సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అనంతరం అదనపు కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. నేతలు అశోక్, శ్రీనివాసులు, కొండమ్మ, వజ్రమ్మ, భారతి, సురేంద్ర, ముని, మోహన్‌బాబు, బాలు, సలోమి తదితరులు పాల్గొన్నారు.

రీచ్‌లలో ఉపాధి కల్పించరూ..



నెల్లూరు(దర్గామిట్ట): ఇసుక టెండర్లకు సంబంధించి నామినేషన్ పద్ధతిన బీసీ, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీలకు దామాషా పద్ధతిలో 50 శాతం రాయితీ కల్పించి.. రీచ్‌లో ఉపాధి కల్పించాలని న్యాయవాది, ఏపీ బీసీ అడ్వొకేట్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రమణయ్య కోరారు. ఈ మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జెడ్పీ సీఈఓ మోహన్‌రావుకు వినతిపత్రాన్ని సోమవారం సమర్పించారు. న్యాయవాది ఆసిఫ్, బహుజన ప్రజాసంఘ నేతలు రవి, కరిముల్లా, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

యోగాలో జిల్లా క్రీడాకారుల ప్రతిభ


ప్రతిభ కనబర్చిన వారితో నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నంద్యాలలో శని, ఆదివారాల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి పేర్కొన్నారు. ప్రతిభ చూపిన వారిని శాంతినగర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం సత్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. బాలికల కేటగిరిలో శివగాయత్రి.. 40 – 50 పురుషుల విభాగంలో జ్యోతి రాజేంద్రకుమార్.. 50 – 60 పురుషుల విభాగంలో ప్రసన్నకుమార్.. 60 ఏళ్లపైబడిన పురుషుల విభాగంలో రఘురామయ్య ద్వితీయ స్థానాలను సాధించారని వివరించారు. జార్ఖండ్‌లో డిసెంబర్‌లో నిర్వహించనున్న యోగా పోటీల్లో వీరు పాల్గొననున్నారని చెప్పారు. డాక్టర్ బీవీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను విధిగా నాటాలి


మొక్కలు నాటుతున్న మేకపాటి రాజమోహన్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): మొక్కలను ప్రతి ఒక్కరూ విధిగా నాటాలని మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో మొక్కలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బీవీనగర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామ్మోహన్ సౌజన్యంతో సోమవారం నాటారు. అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, డాక్టర్ అంకిరెడ్డి, రాఘవేంద్ర శెట్టి, చింతల అమరేంద్రరెడ్డి, రవిచంద్ర, ఆరి ప్రసాద్, గోపీనాథ్, సుబ్బరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న మత్స్యకార నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ సముద్ర తీర ప్రాంత మత్స్యకార సంఘ అధ్యక్షుడు గోవింద్ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. తమిళనాడు, పాండిచ్చేరికి సంబంధించిన బోట్లు వేట నిమిత్తం ఇక్కడికి వస్తున్నాయని, వీటిని అడ్డుకునేలా చూడాలని కోరారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

వాటర్ ప్లాంట్ సీజ్‌పై విచారణ జరపాలి


వినతిపత్రాన్ని అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): అన్ని అనుమతులు పొంది వాటర్ ప్లాంట్‌ను ఓ మహిళ నిర్వహిస్తున్నారని, అయితే ఎలాంటి నోటీసుల్లేకుండా నగరపాలక సంస్థ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు పలువురు సిబ్బంది దాన్ని సీజ్ చేసి బాధితురాలికి జీవనాధారం లేకుండా చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ మేరకు వాటర్‌ప్లాంట్ యజమాని, కుటుంబసభ్యులతో కలిసి కార్పొరేషన్ కార్యాలయంలో అదనపు కమిషనర్ నందన్‌కు వినతిపత్రాన్ని సోమవారం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని 19వ డివిజన్లో వాటర్ ప్లాంట్‌ను వరాల విజయలక్ష్మి నిర్వహిస్తున్నారని, అయితే దీన్ని మూడు నెలల క్రితం సీజ్ చేశారని ఆరోపించారు. మీరేదైనా మాట్లాడాలనుకుంటే రూరల్ ఎమ్మెల్యే కార్యాలయానికి వెళ్లాలని చెప్పారన్నారు. తమ పార్టీకి చెందిన వారనే కారణంతో ఇలాంటి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. సదరు వాటర్‌ప్లాంట్‌ను పరిశీలించి బాధితురాలికి న్యాయం చేయాలని కోరారు. పార్టీ నేతలు శ్రీనివాసరావు, రామ్‌ప్రసాద్ రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కోసం కమిషనర్ నిరీక్షణ


రీచ్‌ను పరిశీలిస్తున్న నారాయణ

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కోసం కమిషనర్ సూర్యతేజ గంటకుపైగా నిరీక్షించారు. వాస్తవానికి భగత్‌సింగ్ కాలనీలోని రీచ్‌ను పరిశీలించేందుకు మంత్రి వస్తున్నారనే సమాచారం అందింది. సోమవారం ఉదయం 10.40కు వస్తారని ముందు తెలిపినా, 11.40 వరకు మంత్రి రాలేదు. దీంతో గంటకుపైగా రీచ్‌లోనే సూర్యతేజ, సిబ్బంది నిరీక్షించారు. ఎట్టకేలకు వచ్చిన అనంతరం భగత్‌సింగ్‌కాలనీ, గాంధీగిరిజనకాలనీ, బోడిగాడితోట, దీనదయాళ్‌నగర్, పొర్లుకట్ట, పొట్టేపాళెం ప్రాంతాల్లోని రీచ్‌లను మంత్రి పరిశీలించారు. కాగా ఇసుక తరలింపులో కొన్ని ఇబ్బందులున్నాయని పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు తెలియజేశారు.

ఉద్యోగాలిచ్చే స్థాయికి ఎదగాలి


ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న రాఖెల్ ఫ్రాఫ్

నెల్లూరు (టౌన్): ఉద్యోగాలను ఆశించే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి యువత ఎదగాలని మెల్‌బోర్న్ యూనివర్సిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రాఖెల్ ఫ్రాఫ్ పిలుపునిచ్చారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో మెల్‌బోర్న్ రోటరీ కెరీర్ ఎడ్యుకేషన్‌పై విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఆర్ఐఓ శ్రీనివాసులు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించిన అనంతరం ఆమె మాట్లాడారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకొని లక్ష్యసాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు, కెరీర్ గైడెన్స్ ట్రెయినర్ అనూషా, ప్రిన్సిపల్స్ గౌస్‌బాషా, సురేష్, ప్రతిమ, ప్రియదర్శిని, శ్రీనివాసులురెడ్డి, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు



నెల్లూరు(క్రైమ్): దీపావళి సమీపిస్తున్న తరుణంలో జిల్లాలోని బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ దుకాణాల్లో పోలీస్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బాణసంచా కేంద్రాలు నిబంధనల మేరకే ఉన్నాయా.. లైసెన్స్‌లో పేర్కొన్న విధంగా నిర్ణీత మోతాదుల్లోనే నిల్వ చేశారా.. జిలెటిన్ స్టిక్స్, పాస్ఫరస్‌ల నిల్వలున్నాయా.. తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. కాగా అనుమతుల్లేకుండా తయారీ, విక్రయాలు, నిల్వలు చేస్తే చర్యలు తప్పవని ఎస్పీ కృష్ణకాంత్ హెచ్చరించారు. బాణసంచా అనధికార విక్రయాలు, నిల్వలపై 101, 112కు సమాచారం అందించాలని కోరారు.

నర్సులకు చీరల పంపిణీ



నెల్లూరు(అర్బన్): నగరంలోని జయభారత్ హాస్పిటల్లో పనిచేస్తున్న నర్సులకు చీరలను రంగనాథ, రాజరాజేశ్వరి భక్తిమండళ్ల ఆధ్వర్యంలో సోమవారం పంపిణీ చేశారు. డాక్టర్ సీతాలక్ష్మి, మెంటా రామ్మోహన్‌రావు, బీజేపీ నేత మిడతల రమేష్, అల్లూరి నాగేంద్రసింగ్, నీలిశెట్టి లక్ష్మణరావు, సుజాత, మహాలక్ష్మి పాల్గొన్నారు.